ఇన్‌స్పైర్ అవార్డులకు సూరారం విద్యార్థుల ఎంపిక

సంధ్య,9వ తరగతి

నవనీత, 9వ తరగతి

సంపత్‌కుమార్, 7వ తరగతి

చిన్నశంకరంపేట, మార్చి 6: మండలంలోని సూరారం జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు సైన్స్ ఫెయిర్‌లో ఇన్‌స్పైర్ అవార్డులకు ఎంపికయ్యారని హెచ్‌ఎం సాయిరెడ్డి గురువారం తెలిపారు. 9వ తరగతి చదువుతున్న తక్కడి సంధ్య, రావణపోయిన నవనీత, ఏడో తరగతి చదువుతున్న సంపత్‌కుమార్ 2024-25 విద్యా సంవత్సరానికి ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరిని హెచ్‌ఎం, గైడ్ ఉపాధ్యాయుడు మనీశ్ రెడ్డి, ఉపాధ్యాయుడు రవి తదితరులు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఐదు ప్రాజెక్టులు ఎంపిక

రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 6: తెలంగాణ కళాశాల విద్యాశాఖ ఏటా నిర్వహించే జిజ్ఞాస విద్యార్థి బృంద పరిశోధన పోటీలు మూడు రోజులుగా హైదరాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్నాయి. ఈ పోటీల్లో మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తెలుగు, ఇంగ్లిష్, కెమిస్ట్రీ, కామర్స్, బోటనీ విభాగాల విద్యార్థులు రూపొందించిన 5 ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్ తెలిపారు. ఈ పోటీల ఫలితాలు ఈనెల చివరి వరకు వెలువడుతాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను అధ్యాపకులు, తదితరులు అభినందించారు.

వైభవంగా చాకలి ఐలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

నిజాంపేట, మార్చి 6: మండలంలోని చల్మెడలో చాకలి ఐలమ్మ విగ్రహ ప్రతిష్టను రజక గ్రామ సంఘ సభ్యులు గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంఘం జిల్లా అధ్యక్షుడు సంగుస్వామి హాజరయ్యారు. ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పించారు. పెత్తందారుల నుంచి విముక్తి కోసం పోరాడిన వీర వనిత అని ఆమె సేవలు కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బాల్‌రెడ్డి, చల్మెడ, నందిగామ మాజీ ఉప సర్పంచులు రమేశ్, గెల్లు రాజం, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు మావురం రాజు, గ్రామ రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

దాసాంజనేయ స్వామి గుడికి శంకుస్థాపన

రామాయంపేట, మార్చి 6: పట్టణంలోని పాండు చెర్వు కట్టవద్ద కల్యాణ రామచంద్ర స్వామి ఆలయ సమీపంలో దాసాంజనేయ స్వామి గుడికి గురువారం శంకుస్థాపన చేశారు. ఆలయ కమిటీతో పాటు దాత జొన్నల బాలు దంపతులు భూమిపూజ చేశారు. జొన్నల బాలకృష్ణ, అవంతిక దంపతులు సొంత ఖర్చుతో ఈ ఆలయాన్ని నిర్మిస్తున్నారు. ఆలయ పూజారి సత్యనారాయణ, శ్రీనివాస్ వారిని సన్మానించారు.

అంత్యక్రియలకు కంఠారెడ్డి ఆర్థిక సాయం

నిజాంపేట, మార్చి 6: నిజాంపేటకు చెందిన మల్లేశం (65) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి మృతుడి అంత్యక్రియలకు రూ.5 వేలను స్థానిక నాయకుల ద్వారా బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు నాగరాజు, యూత్ మండల అధ్యక్షుడు మావురం రాజు, మల్లేశం తదితరులు ఉన్నారు.

ఆపదలో తోటి ఉద్యోగుల ఆర్థిక సాయం

రామాయంపేట, మార్చి 6: మండలంలోని కాట్రియాల గిరిజన తండాకు చెందిన అటవీశాఖ వాచర్ శంకర్ నాయక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న తోటి ఉద్యోగులు శంకర్‌కు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని గురువారం అందజేశారు. లస్కర్‌నాయక్, స్వామి, శ్రీనునాయక్, స్వామి, దుర్గా నాయక్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 6: మెదక్‌లోని కుమ్మరిగడ్డలో పెంకుటిల్లు దగ్ధమై నిరాశ్రయులైన సంతోష్ కుటుంబానికి లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ గురువారం పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం, 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఆయన వెంట హవేళీఘనపూర్ మాజీ ఎంపీటీసీ శ్రీకాంత్ ఉన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన కంఠారెడ్డి



మెదక్‌రూరల్, మార్చి 6: మండలంలోని మంబోజిపల్లి కొయ్యగుట్ట మల్లన్న ఆలయ పూజారి మల్లన్న కుమారుడు నర్సింలు, సంధ్యారాణి వివాహం మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో గురువారం జరిగింది. ఈ వివాహానికి బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంఠారెడ్డి తిరుపతిరెడ్డితో పాటు కొండల్‌రెడ్డి, గంజి నవీన్ , బీఆర్ఎస్ జిల్లా నాయకులు, మాజీ సర్పంచులు అంజాగౌడ్, ప్రభాకర్, నాయకులు ఉన్నారు.

గ్రామాల్లో నీటి కటకట

ట్యాకర్ల నుంచి నీళ్లు పట్టుకుంటున్న మహిళలు

బోరు మోటరు నుంచి నీళ్లు తెచ్చుకుంటున్న మహిళ

గత ప్రభుత్వంలో ఇంటి వద్దే మిషన్ భగీరథ నీరు (ఫైల్)

- వేసవి కాలం ప్రారంభంలోనే ఇబ్బందులు
- బోరు బావుల నుంచి తీసుకొస్తున్న మహిళలు

రామాయంపేట రూరల్, మార్చి 6: మండలంలో వేసవి ప్రారంభంలోనే తాగునీటి ఎద్దడి నెలకొన్నది. మిషన్ భగీరథ నీరు కూడా పూర్తి స్థాయిలో రావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గంటల తరబడి తాగునీరు వచ్చేది. తాము ఎప్పుడూ నీటి కోసం ఇంటి నుంచి బయటకు వెళ్లలేదు. ఇప్పుడు ఎండాకాలం మొదలు కాకుండానే తాగునీటి కోసం నానా ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సరాఫరాలో ఏదైనా సమస్య వస్తే రోజుల తరబడి పరిష్కరించకడం లేదని స్థానికులు వాపోతున్నారు. తమకు ఉమ్మడి రాష్ట్రంలో ఎదుర్కొన్న నీటి సమస్యవస్తుందేమో అని భయాందోళనలు చెందుతున్నారు.

నీటి సమస్య తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలి

- క్షేత్ర స్థాయిలో ఇబ్బంది లేకుండా ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలి
- కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, మార్చి 6 (నమస్తే తెలంగాణ) : వేసవిలో నీటి సరఫరాలో అంతరాయం లేకుండా, క్షేత్ర స్థాయిలో సమస్యలు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై అదనపు కలెక్టర్ నగేశ్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీపీవో యాదయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, ట్రాన్స్‌కో ఎస్ఈ శంకర్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్స్ రవీంద్ర కుమార్, శివ దయాల్, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, పంచాయతీ సెక్రటరీలు, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామాల వారీగా ఎంపీడీవో, పంచాయతీ సెక్రెటరీ, మిషన్ భగీరథ అధికారుల సమన్వయంతో తాగునీటి సంబంధించి గ్రామస్థాయి ప్రత్యేక యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని గ్రామాల్లో, మండలాల్లో, మున్సిపాలిటీల్లో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారుల చర్యలు చేపట్టాలన్నారు.

ధాన్యం కొనుగోలుపై ప్రత్యేక యాక్షన్ ప్లాన్

వాతావరణ అసమతుల్యత వల్ల వర్షాలు పడే అవకాశం ఉంటే టార్ ప్లైన్ సీట్స్ సిద్ధం చేసుకోవాలన్నారు. వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకుని తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకం పనులు చేసే కూలీలకు, పనిచేసే దగ్గర తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. జిల్లా దవాఖానల్లో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్ని మందులు అందుబాటు ఉంచుకోవడంతో పాటు వేసవిని దృష్టిలో పెట్టుకుని ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో పెట్టుకుని సన్ స్ట్రోక్ సోకిన వారిని ప్రాథమిక చికిత్సలు ఎలా చేయాలనే దానిపై ఆశ కార్యకర్తలకు అవగాహన కల్పించాలన్నారు.


పాపన్నపేట: మిన్పూర్ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

మిన్పూర్ సబ్ స్టేషన్ పరిశీలన

పాపన్నపేట, మార్చి 6: వేసవిలో విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ విద్యుత్ అధికారులకు ఆదేశించారు. గురువారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా పాపన్నపేట మండలంలో మిన్పూర్ 220 బై 132 కేవీ సబ్‌స్టేషన్‌ను విద్యుత్ శాఖ ఎస్ఈ శంకర్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉత్పత్తి చేయడంతో పాటు సరఫరాను మెరుగుపర్చడంతో విద్యుత్ శాఖ సంస్థలు ఎంతో ప్రగతిని సాధిస్తున్నాయన్నారు. పాపన్నపేట మండలం మిన్పూర్ 220బై 123 కేవీ సబ్‌స్టేషన్ ద్వారా జిల్లాలో 33బై 11 కేవీకి సంబంధించి 18 సబ్‌స్టేషన్లకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. విద్యుత్ ఫిర్యాదులు వస్తే తక్షణమే పరిష్కరించాలన్నారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని ఆదేశించారు. జిల్లాలో ఎక్కడా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినా వెంటనే 1912కు టోల్ ఫ్రీ నెంబర్‌కు వినియోగదారులు ఫోన్ చేయాలన్నారు. ప్రజలకు ఈ నెంబర్ తెలిసే విధంగా ప్రచారం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

వికసిత్ భారత్ పోస్టర్‌ను ఆవిష్కరణ

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 6: వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్ పోస్టర్‌ను కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో మెదక్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్‌తో కలెక్టర్ రాహుల్ రాజ్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో యువత ఆలోచన విధానాన్ని, అభిప్రాయాలను పాలసీ విధానంలో పొందుపర్చి భారత్‌ను శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దేందుకు, ప్రతిష్టాత్మకంగా భారత యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రూపొందించారన్నారు. రాష్ట్రంలో మెదక్ నోడల్ జిల్లాను ఎంపిక చేశారన్నారు. జిల్లా పరిధిలో మెదక్ జిల్లాతో పాటు సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాలు వస్తాయన్నారు. ఈ జిల్లాలలోని 18 నుంచి 25 ఏండ్ల వయస్సు గల యువత ఈ నెల 9లోగా 'మై భారత్' పోర్టల్ ద్వారా పేరు నమోదు చేసుకుని 'వికసిత్ భారత్‌పై నా అభిప్రాయాలు' అనే అంశంపై ఒక నిమిషం విడివి గల వీడియోను అప్‌లోడ్ చేయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ మాట్లాడుతూ కార్యక్రమానికి సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే 9885077541, 9985372264, 9912787070 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఇంటర్ పరీక్షకు 98 శాతం హాజరు

- 5,427 మంది విద్యార్థులకు 5,320 మంది హాజరు
- ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి మాధవి

మెదక్‌లోని పరీక్షా కేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 6: జిల్లాలో ఇంటర్ పరీక్షలు సజావుగా సాగుతున్నాయి. గురువారం రెండో రోజు ద్వితీయ సంవత్సరం మొదటి పరీక్ష 98.02 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షా సమయానికి ముందే ఆయా కేంద్రాలకు చేరుకున్నారు. జిల్లా వ్యాపంగా 30 పరీక్షా కేంద్రాల్లో 5,427 మంది విద్యార్థులకు 5,320 మంది హాజరయ్యారు. 107 మంది గైర్హాజరయ్యారు. జనరల్‌లో 4,988 మందికి 4,889 మంది, ఒకేషనల్‌లో 439 మందికి 431 మంది విద్యార్థులు హాజరైనట్లు ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి మాధవి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 98.02 శాతం హాజరయ్యారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

జాతీయ రహదారిపై ఆరెంజ్ బల్లట్లను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

నర్సాపూర్, మార్చి 6: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్సై లింగం తెలిపారు. నర్సాపూర్‌లోని ఎన్‌హెచ్ 756డీ రోడ్డుపై ప్రమాదాల నివారణకు ఆరంజ్ రంగు గల బల్లట్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి ప్రోత్సాహకంతో నర్సాపూర్ పరిధిలోని కొండాపూర్ గ్రామ శివారు నుంచి రెడ్డిపల్లి గ్రామ శివారు వరకు దాదాపు 15 కిలోమీటర్ల మేర రోడ్డుపైన మధ్య భాగంలో మూలమలుపులు ఉన్న చోట వాహనాల వేగాన్ని తగ్గించి, నెమ్మదిగా వెళ్లే విధంగా బల్లట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాహనదారులు అతి వేగంతో కాకుండా జాగ్రత్తగా నడిపి సురక్షితంగా గమ్యం చేరాలని కోరారు.

విశ్వకర్మ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

-కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, మార్చి 6 (నమస్తే తెలంగాణ): విశ్వకర్మ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో పీఎం విశ్వకర్మ పథకంపై అధికారులు, అమలు కమిటీ సభ్యులతో ఆయన సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కులవృత్తిదారుల సంక్షేమం కోసం ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం ప్రారంభించిందన్నారు. టైలరింగ్, బార్బర్, భవన నిర్మాణ కార్మికులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు లబ్ధి చేకూరే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేశ్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యనందించాలి

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో నర్సింలు

మనోహరాబాద్, మార్చి 6: మెరుగైన విద్యను అందిచాలని ఎంఈవో నర్సింలు అన్నారు. మనోహరాబాద్ మండలం కస్తూర్బా పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. పాఠశాలలో విద్యాబోధన, వంటగది, పరిసరాలను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో కృష్ణమూర్తి, ఎంపీవో లక్ష్మీ నర్సింలు, ప్రిన్సిపాల్ గౌతమి ఉన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు శ్రమించాలి

మాట్లాడుతున్న ఇంప్యాక్ట్ ఫౌండేషన్ వక్త లింగరాజు

పాపన్నపేట, మార్చి 6: పోడ్చన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గురువారం ఇంప్యాక్ట్ ఫౌండేషన్ వక్త లింగరాజు ఆధ్వర్యంలో ప్రేరణాత్మక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోల్ సెట్టింగ్, మైండ్ సెట్, ఎగ్జామ్ ఫోబియాపై సూచనలు చేశారు. విద్యార్థులు తమ లక్ష్యాలను ఎలా నిర్ధారించుకోవాలో అనుకున్న గమ్యాని చేరుకోవడానికి పలు సూచనలు చేశారు. కార్యకమంలో గ్రామస్తులు భూపాల్‌రెడ్డి, మోహన్‌రావు, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు

చిన్నశంకరంపేట, మార్చి 6: ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఉపయోగపడతాయని ఎస్సై నారాయణ తెలిపారు. గురువారం చిన్నశంకరంపేట ఎంపీడీవో కార్యాలయం మెదక్ చేగుంట ప్రధాన రహదారి వద్ద డాక్టర్ శ్రీధర్, కంచర్ల చంద్రశేఖర్ సౌజన్యంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో శ్రీమాన్, నరేశ్‌గౌడ్, స్వామి, లింగంస్వామి తదితరులు ఉన్నారు.

బాహా ఎస్ఏఈ ద్వారా ఉద్యోగావకాశాలు

నర్సాపూర్, మార్చి 6: ఈ బాహా ఎస్ఏఈ ఇండియా-2025 హెచ్ఆర్ ఆధ్వర్యంలో నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ కళాశాలలో విద్యార్థులకు గురువారం ఉద్యోగవకాశాలు లభించాయి. బాహా ఎస్ఏఈ ఇండియా ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ బాల్‌రాజ్ సుబ్రమణ్యం మాట్లాడుతూ బీవీఆర్ఐటీలో హెచ్ఆర్ మీట్ నిర్వహించి, 15 కంపెనీల ద్వారా 600 మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. బాహా సే ఇండియా అనేది ఒక ప్రధాన విద్యార్థి పోటీ, ఇక్కడ ఇంజినీరింగ్ విద్యార్థులు ఆల్ టెరైల్ వెహికల్ డిజైన్ చేస్తారన్నారు. రేసులో పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీ విద్యార్థులకు ఆటోమోటివ్, అనుబంధ పరిశ్రమల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందేందుకు, ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పనకు, రొటీన్‌గా చదివే దానికి ప్రాక్టికల్‌గా తెలుసుకునేందుకు, విద్య, పరిశ్రమల మధ్య గల అనుసంధానం గురించి తెలుసుకునేందుకు సహాయపడుతుందన్నారు. బాహా సే ఇండియా 2025 సీజన్ తన ఈవెంట్‌లను మూడు విభాగాల్లో విజయవంతంగా ముగించిందని తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి మృతి

శ్రీనివాస్ (ఫైల్)

కౌడిపల్లి, మార్చి 6: అప్పుల బాధతో గడ్డి మందు తాగి వ్యక్తి మృతి చెందిన ఘటన కౌడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కంచనపల్లిలో జరిగింది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బోయిని శ్రీనివాస్ (38)కు ఇద్దరు కుమారులు. మూడేండ్ల కిందట ఇంటిని నిర్మించాడు. దీనికి తెలిసిన వారి వద్ద నుంచి అప్పు చేశాడు. అప్పుల కిందికి తనకున్న పొలం సైతం అమ్మినా తీరలేదు. రూ.40 లక్షల అప్పు ఎలా తీర్చాలో తెలియక కొన్ని రోజులుగా దిగులుగా ఉంటున్నాడు. మనస్తాపానికి గురై చివరకు ఈనెల 3న ఉదయం తన ఇంటిపై గడ్డి మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మెదక్ ప్రైవేటు దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఈనెల 5న రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు

భద్రు తండాకు సూచిక బోర్డు ఏర్పాటు

నర్సాపూర్, మార్చి 6: మండలంలోని రెడ్డిపల్లి పంచాయతీ భద్రు తండాకు సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. రెడ్డిపల్లి మాజీ ఉపసర్పంచ్ అశోక్‌గౌడ్ తాండావాసుల కోరిక మేరకు సొంత నిధులతో గురువారం సూచిక బోర్డును ఏర్పాటు చేయించారు. అశోక్‌గౌడ్‌కు తండావాసులు లక్ష్మణ్‌నాయక్, నిఖిల్‌నాయక్, రమేశ్‌నాయక్, సుధాకర్ ధన్యవాదాలు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★ I, AMGOTH BUJJI BAI, D/o. Amgoth Kishannayak, R/o. H.No. 2-36/3, Narayankhed Mandal, Ryalamadugu, Sanjeevaraopet, Sangareddy (Dist.), T.S., Aadhar No. 6692 4569 7784. Changed My Name RATHOD BUJJI BAI to AMGOTH BUJJI BAI, D/o. Amgoth Krishannayak for all future purpose.
NT-Narsa

★ I, NAZIM, S/o. Osman Ali, R/o. H.No. 14-59, Zam Zam Colony, Allipur, Zaheerabad, Sangareddy District, Telangana-502 318, have Changed My Name as Md NAZIM, S/o. Osman Ali. Hereafter, I shall be known as Md NAZIM, S/o. Osman Ali.
NT-Narsa

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు,
వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు
మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
సిద్దిపేట/గజ్వేల్/తూప్రాన్/మెదక్ : 80966 77663
సంగారెడ్డి/జహీరాబాద్/నారాయణఖేడ్ : 9182777658
పటాన్‌చెరు : 80966 77657